
# మంగమ్మగారు మూవ్ ఇన్ స్పెషల్

"చిన్నమ్మలూ! ఇందాకా వాకింగ్ వెళ్ళినప్పుడు పార్క్‌లో మా ఫ్రెండ్ కనబడి చెప్పింది. వాళ్ళు అద్దెకుంటున్న "లేక్ వ్యూ" కాంప్లెక్స్‌లో ఇళ్ళు కాళీ వున్నాయట. రెండు పడక గదుల ఇల్లు వెయ్యిడాలర్లకే ఇస్తున్నార్ట. అక్కడికి



మారిపోకూడదే హాయిగా? నెలకు అయిదు వందలు డాలర్లు అద్దెలో మిగులుతాయి. అంతే కాక ఈ డిసెంబరు ఆఖరులోగా అద్దెకు వచ్చేవాళ్ళకు ఒకనెల అద్దె రాయితీ ఇస్తార్ట. వెయ్యి డాలర్లంటే చేదా?" గుక్క తిప్పుకోకుండా చెప్పేశారు మంగమ్మగారు.

'అత్తయ్యా! ఇక్కడ ఇల్లు మారడ మంటే అంత సులభంకాదు. అక్కడిలాగా ఇంట్లో చెత్త ఊడ్చితే ఇల్లు గలవాళ్ళకు మంచిది కాదు అని ఇల్లంతా నానాకంగాళీగా వదిలేసి పోలేము. చచ్చినట్టు ఇంట్లో గదులన్నీ శుభ్రం చేసి వాళ్ళు మనకి ఎలా ఇచ్చారో అలా వదలాలి. మనం వెళ్ళేముందు వాళ్ళు వచ్చి ఇన్‌స్పెక్ట్‌చేస్తారు కూడా' అన్నాడు అల్లుడు.

"అదేం భాగ్యంలే శంకర్... ఎవరినన్నా పనివాళ్ళను పెట్టి క్లీన్ చేయిస్తే సరి..." అన్నదావిడ తేలిగ్గా.

"ఇక్కడ అలాంటివి కుదరవు అత్తయ్యా... అంతగా అవసరం అయితే స్నేహితులు సహాయం తీసుకోవాలి. అయినా ఈ ఇంటికి కాస్త అద్దె ఎక్కువైనా వసతులూ ఎక్కువే కదా! హై ఎండ్ కాంప్లెక్స్. గేటెట్ కమ్యూనిటీ సెక్యూరిటీ ఎక్కువ. బయటి నుండి మన స్నేహితులైనా గేటు దాటి రావాలంటే మనం రిమోట్ బటన్ నొక్కి తలుపు తెరవాల్సిందే." అన్నాడు అల్లుడు.

"ఈ సంవత్సరం ఆఖరికి మన ఇంటికి లీజ్ పిరియడ్ అయిపోతుంది కదా అని అమ్మను తీసుకెళ్ళి చుట్టు పక్కల కాంప్లెక్స్‌లలో కాళీ వున్నాయేమో అని చూసొచ్చాంలేండి నిన్న. అందుకే అమ్మ ఈ విషయం కదిపింది." అంది చిన్నమ్మలు.

కూతురితో వెళ్ళి అద్దె ఇంటికోసం చుట్టు పక్కల వున్న పార్క్‌వ్యూ, కంట్రీఇన్, రాంబల్ వుడ్ కాంప్లెక్స్‌లలో ఇళ్ళు చూసి రావడం మంగమ్మ గారికి కొత్త అనుభవం. అన్ని చోట్లా చాల పోష్‌గా రిచ్‌గా వున్న రెంటల్ ఆఫీస్‌ల్లో చైనీస్ తప్పితే జపనీస్ స్టాఫ్ వీళ్ళకి మర్యాదగా షేక్ హాండ్ ఇచ్చి కాఫీ ఆఫర్ చేసి ఇళ్ళు చూపించారు.

ప్రస్తుతం చిన్నమ్మలు వాళ్ళు వుంటున్న పార్క్‌వుడ్ కాంప్లెక్స్‌లో ఇంట్లో డిష్‌వాషర్, ఫ్రిజ్, ఓవెన్, స్టౌ ఇంట్లోనే వున్నా వాషింగ్ మెషిన్లు మాత్రం క్రింద బేస్‌మెంట్‌లో లాండ్రీరూములో వున్నాయి. వీళ్ళు చూసి వచ్చిన అపార్ట్‌మెంట్స్‌లో కొన్నింట్లో వంటగది పక్కన చిన్న గదిలో వాషింగ్ మెషిన్ డ్రయర్ కూడా వున్నాయి. ప్రస్తుతం వుంటున్న కాంప్లెక్స్‌లో వున్నట్టే స్విమ్మింగ్ పూలు, మెయిల్‌రూమ్‌లతో బాటు అదనంగా కొన్నిచోట్ల జిమ్‌కూడా వుంది.

కొన్నిటికేమో అద్దె ఎక్కువనీ, ఇంకొన్ని సేఫ్టీ తక్కువని వద్దనుకుని వచ్చేశారు మంగమ్మగారు, వాళ్ళ అమ్మాయి. అందుకే ఈ రోజు తన పార్క్ స్నేహితురాలితో వెళ్ళి ఆవిడ వుంటున్న ఇల్లు చూసి వచ్చిందావిడ. అక్కడ ఆవిడకు అన్నింటికన్నా నచ్చింది ఇక్కడిలా అయిదు అంతస్తులు కాకుండా ఒక ఇంట్లో రెండే అంతస్తులువుండడం. గేటెడ్ కమ్యూనిటీ అంటూ ఎక్కడికి వెళ్ళాలన్నా తాళాలు తీసుకెళ్ళనక్కర్లేదన్నది మరో అంశం ఆవిడకు నచ్చింది.

'రేపు వెళ్ళి చూద్దాంలే అమ్మా! అన్నది చిన్నమ్మలు. ఆ రాత్రి భర్తతో ఈ విషయం మాట్లాడి ఎలాగైతేనేం మర్నాడు వెళ్ళి ఆ ఇల్లు చూసి వచ్చేందుకు ఒప్పించింది.

గేటేడ్ కమ్యూనిటీ కాదు అన్నది ఒక్క తేడా తప్పితే మిగతా అన్ని సౌకర్యాలూ వున్నాయి. 'లేక్ వ్యూ' కాంప్లెక్స్ లో. నెలకు అయిదు వందల డాలర్లు అద్దెలో మిగిలితే రేపు పుట్టబోయే పిల్లో పిల్లవాడికో ఖర్చులకు కలసి వస్తుందనీ ప్రస్తుతం వుంటున్న ఇంటికి దగ్గర్లోనే వుంది గనుక సామాను అదీ మార్చడం కష్టంకాదనీ, ఎలాగైనా మొగుడిని ఒప్పించమనీ చిన్నమ్మలికి పదే పదే చెప్పింది మంగమ్మగారు.

శంకర్‌కీ, మంగపతిగారికీ కూడా ఇల్లు సౌకర్యంగానే వుందని అనిపించింది. క్లోజ్డ్ కార్ పార్కింగ్ కూడా వుంది.

మంగమ్మగారి పార్క్ స్నేహితురాలుకూడా వీళ్ళతో బాటు వచ్చి అక్కడ తన కొడుకు కోడలు రెండేళ్ళుగా వుంటున్నారనీ చాల సౌకర్యంగా వుందనీ, తను వచ్చి నాలుగు నెలలవుతున్నా తనకేమి ఇబ్బంది అనిపించలేదనీ ఆ ఇంటికి కితాబిచ్చింది.

ఆరోజే అప్లికేషన్ ఫామ్ తీసుకుని తమ వివరాలు, ఉద్యోగాలు, ఎంతమంది వుండేది రాసి ఇచ్చేసి అడ్వాన్స్ కట్టేశాడు శంకర్.

తన మూలాన ఆ ఇల్లు చూడ్డం, నచ్చడం, అందువలన కూతురికి బోలెడు డబ్బు ఆదా కావడం మంగమ్మగారికి మహా గర్వంగా అనిపించింది.

ఇక అసలు కథ అప్పుడు మొదలయింది. ఇంటి ముందున్న పేటియో మొదలుకొని, బెడ్‌రూములు, వంటిల్లు మాత్రమేకాక బాత్‌రూములు కూడా శుభ్రం చేయడం మొదలు పెట్టారు.

శంకర్ తనకు దగ్గరి స్నేహితులిద్దరికి ఫోన్‌చేసి చెప్పాడు వీకెండ్ వచ్చి సామాను ప్యాకింగ్‌లో సాయం చేయమని.

ఇల్లంతా పరచివున్న కార్పెట్ మీద ఎక్కడెక్కడ మరకలు పడ్డాయో వెతికి కార్పెట్ క్లీనింగ్ లిక్విడ్ స్ప్రే చేసి తుడుస్తోంది చిన్నమ్మలు.

కిచెన్ కాబినెట్, ఫ్రిజ్, ఓవెన్, స్టౌ అన్నీ మెరిసేలాగా తుడవడం మొదలు పెట్టారు మంగమ్మగారు.

బాత్‌రూంలో కిటికీ అద్దాలమీద చేరిన 'మిల్ డ్యూ' తుడిచి, బాత్ టబ్, వాషింగ్ బేసిన్ రుద్ది రుద్ది కడుగుతున్నాడు శంకర్.

ఇంతలో ఫోన్ మోగింది. శంకర్ తీశాడు. "ఆ వాసూ వచ్చారా? గేట్ తెరుస్తున్నాను." అని చెప్పి మరో నెంబర్ నొక్కాడు వాసు, అనూరాధ మేడ మీదకి వచ్చారు.

"బాగున్నారా పిన్నిగారూ? అంటూ మంగమ్మగారిని పలుకరించిన వాసు పేటియోలోకి దారితీసే అద్దాల స్లైడింగ్ డోర్స్‌ని తుడుస్తున్న మంగపతిగారిని చూసి" మీరిలా వచ్చి కూర్చోండి బాబాయ్‌గారూ... నేను తుడుస్తాను. అంటూ అటు నడిచాడు.

"ఈ పనులు మీకెందుకులే నాయనా... ముందు ఈ సమోసాలు తిని, కాఫీ త్రాగండి" అంటూ ప్లేట్స్ అందించారు మంగమ్మగారు.

"ఇంత హడావుడిలో ఈ సమోసాలు చేసే పని పెట్టుకున్నారా అత్తయ్యగారు?" అంటూ నొచ్చుకుంది అనూరాధ.

"దగ్గరున్న ఛాట్ కెఫే లో తెచ్చాను లేమ్మా" అన్నాడు శంకర్.

టిఫిన్ తిన్నాక వాసు వాక్యూమ్ క్లీనింగ్‌లో పడ్డాడు అనురాధ వంటింటి సామాను సర్దడంలో సాయం చేయసాగింది.

సాయంత్రం అయ్యేసరికి అందరూ అలసిపోయారు. "అమ్మా రాత్రికి వంటచేసుకోవద్దు...ఇండియన్ పేలెస్‌కి వెళ్ళి భోజనం చేద్దాం" అంది చిన్నమ్మలు

హోటల్‌లో అడుగు పెట్టగానే కళ్ళను కట్టి పడేసేట్టు పెద్దసైజులో గోడకు వున్న అలనాటి షమ్మికపూరు, వహీదారెహమాన్‌లతో బాటు ఇవాల్టి షారూఖ్‌ఖాన్, ఐశ్వర్యారాయ్ ఫోటోలు వున్నాయి.

"ఇక్కడకు వస్తే ఇండియాలో వున్నట్టే అనిపిస్తుంది". సంతోషంగా చుట్టూవున్న జనాన్ని చూస్తూ అన్నారు మంగమ్మగారు.

"అత్తయ్యా! ఈ 'బే' ఏరియాలో సుమారు లక్షాయాభై వేలమంది ఇండియన్స్ వున్నార్ట. అందుకే మరి ఉడుపి, కామత్ లాటి రెస్టారెంట్స్, చుడీదార్లు" చీరెలు అమ్మే షాపులు తెరిచారు. మీరు పోయినసారి వచ్చినప్పుడు జనవరి ఫస్ట్ నాడు మనందరం లివర్‌మూరు వెంకటేశ్వరస్వామిగుడికి వెళ్ళినప్పుడు చూశారుగా జనం ఎలా తిరుపతిలో లా 'క్యూ' లలో వెళ్ళాల్సి వచ్చిందో." శంకర్ అన్నాడు.

బటర్‌నాన్, నవరతన్ కుర్మా లాటి నార్త్ ఇండియన్ డిషెస్‌తో బాటు పులిహోర, క్షీరాన్నం వంటి పదార్థాలు సుష్టుగా తిని బయట పడ్డారు అందరూ.

ఇంటికి వెళ్తుండగా దార్లో అడిగారు మంగమ్మగారు "శంకర్! మీ అత్తయ్య తరపువాళ్ళు ఇక్కడెక్కడో దగ్గర్లో వున్నా రన్నావు కదూ... ఎక్కడా?" 'శాంటక్లారా' లో వున్నారు అత్తయ్యా... ఒకరోజు వెడదాం వాళ్ళింటికి అన్నాడు శంకర్.' వారంలో రెండు రోజులు మీకు దొరికే సమయం. ఎన్ని పనులో వుంటాయి. ఇక ఊళ్ళకు వెళ్ళడం ఎక్కడ వీలవుతుందిలే శంకర్" అన్నారు మంగపతిగారు.

"'శాన్ హోసె', 'శాంటక్లారా', ' సన్నీ వేల్ ' మిల్పిటాస్, హేవర్డ్, 'ప్లెజంటైన్' ఇవన్నీ దగ్గర దగ్గరే వున్న సిటీస్ మామయ్య గారూ. ఫ్రీ వేమీద డెబ్బై మైళ్ళ స్పీడ్‌లో వెడితే గంట ప్రయాణం అంతే." అన్నాడు శంకర్.

"స్టాన్ ఫర్డ్ యూనివర్శిటీ, బెర్కిలీ యూనివర్సిటీ చూడాలి నాన్నా మీరు" అంది చిన్నమ్మలు.

వాసూ, అనూరాధ మర్నాడు వస్తామని వెళ్ళిపోయారు. కర్నూలుకు చెందిన తను కాలిఫోర్నియాలో ఫ్రీమాంట్ సిటీలో మౌరీ అవెన్యూలో కార్లో తిరగడం కలయో నిజమో అన్నట్టు బయటకు చూస్తూ కూర్చున్నారు మంగపతిగారు. ఆయన అమెరికాకు రావడం అది రెండోసారి అయినా ఇంకా అదేదో మరో ప్రపంచమనే అనిపిస్తుంది ఆయనకు.

"యూహోల్ ' కోసం ఫోన్ చేశారా?" చిన్నమ్మలు భర్త నడిగింది.

"ఆ.. రేపు వాసు తీసుకొస్తాడు." శంకర్ చెప్పాడు.

"నాకు తెలియక అడుగుతానే చిన్నమ్మలూ! ఆ సామాను తీసుకువెళ్ళే 'యూహోల్' బండికి గ్యాస్ మనమే వేయిస్తాం, మనమే సామాను ఎక్కించి, డ్రైవ్ చేసుకోవాలి అన్నావు కదా.... మరి రోజు అద్దె అరవై డాలర్లా? అంటే దగ్గర దగ్గర మూడువేలా?" గుండెమీద చేతులు వేసుకుని బాధ పడ్డారు మంగమ్మగారు.

"అమ్మా! డాలర్ విలువని రూపాయిల్లోకి మారిస్తే ఇక్కడ తిండి తినలేము. ఒక మామిడికాయ ఒకటిన్నర డాలరు పెట్టి తెచ్చుకుంటాం, పుచ్చకాయ ఆరు డాలర్లు అంతెందుకు దోసె ఉడుపిలో తెచ్చుకుంటే ఆరు డాలర్లు. అవిక్కడ రూపాయలనుకోవాలంతే.." చిన్నగా నవ్వి అంది మంగమ్మగారి కూతురు. మర్నాడు వాసుకి సహాయంగా వచ్చిన మరో ఇద్దరు స్నేహితుల సహకారంతో సామానంతా 'యూహోల్' లోకి ఎక్కించి ఇల్లు మారారు.

అన్నీ విప్పి సర్దుకుని రాత్రి అలసిపోయి పడుకున్నారు. "మీస్నేహితులు నలుగురు రాబట్టి సరిపోయిందిగానీ ఇక్కడ ఇల్లు మారడం అంటే పెళ్ళి చేసినంత పని వున్నట్టు వుంది" అన్నారు మంగపతిగారు.

"ఇక్కడ అన్నింటికీ స్నేహితులే మామయ్యగారు" అన్నాడు శంకర్.

"మేము వెళ్ళిపోయాక మీ అమ్మగారు, నాన్నగారు వస్తారు కదా! వాళ్ళకు ఇక్కడ బాగా కాలక్షేపం... చుట్టూ తెలుగువాళ్ళున్నారు" అన్నారు మంగమ్మగారు.

"ఈ ఇంటికి మారినందుకు మొదటినెల అద్దెరాయితీగా ఇస్తున్నారుకదా ఆ వెయ్యిడాలర్లూ, ఇకపై అద్దెలో తగ్గిన అయిదువందలు వేరుగా పెడదాం... వచ్చే ఏడాది మనకు పాపో బాబో వస్తే స్త్రాలరు, కారుసీటు, క్రిబ్, బాత్‌టబ్, బౌన్సరు, స్వింగ్ లాటివన్నీ కొనడానికి సరిపోతుంది. నిద్రపోయేముందు శంకర్‌తో అంది చిన్నమ్మలు.

పదిహేను రోజులు గడిచాయి. కాళీ చేసిన ఇంటికి అడ్వాన్స్‌గా కట్టిన డబ్బు పదిహేనువందల్లో అయిదువందలు చెక్ పంపించారు వాళ్ళు.

"అదేమిటీ ? మిగతా వెయ్యిపట్టుకున్నారెందుకనీ? అంటూ కలవరపడింది చిన్నమ్మలు.

"మనం అలా అడుగుతామనే మిగితా డబ్బుకు లెక్కకూడా రాశారు. కార్పెట్ క్లీనింగ్‌కు, కిచెన్ పెయింటింగ్‌కు, బాత్‌రూమ్ 'రిటచ్' చేయడానికీ ఆ వెయ్యి ఖర్చయిందట! దిగాలుగా అన్నాడు శంకర్.

"ఈ ఇంట్లో కారుపార్కింగ్ ప్లేస్‌కీ, జిమ్‌కీ, స్విమ్మింగ్‌పూల్‌కీ ఎక్స్ట్రా డబ్బు కట్టాలట అమ్మలూ..." చల్లగా చెప్పారు మంగమ్మగారు, రెంటల్ ఆఫీసు వాళ్ళు పంపిన కాగితం అందిస్తూ. చిన్నమ్మలు మొగుడికేసి దిగులుగా చూసింది. భుజాలు కదిపి కళ్ళు మూసుకున్నాడు శంకర్. "రేపు పాత ఇంటి లీజింగ్ ఆఫీసుకి వెళ్ళి అడుగుతాం. మరీ దారుణంగా వెయ్యిడాలర్లు పట్టుకుంటారా?" కోపంగా అంది చిన్నమ్మలు.

"ఇంటి క్లీనింగ్‌కి మేము ఇంకా ఎక్కువే ఖర్చుపెట్టాం" అంది ఆఫీసులో ఈ వ్యవహారంచూసే లిండా అన్న చిన్నది. ""దేనికోసం?" వుక్రోషంగా అడిగింది చిన్నమ్మలు.

"టుగెట్ రిడ్ ఆఫ్ కర్రీ స్మెల్ " అన్నది లిండా కూల్‌గా. మాట్లాడకుండా వెనక్కి వచ్చారు శంకర్, చిన్నమ్మలు. "మూవ్ ఇన్ స్పెషల్ ఆఫర్‌లో మొదటి నెల అద్దె వెయ్యి డాలర్లు మిగులుతాయి అనుకుంటే అదికాస్తా

ఖాళీ చేసివచ్చిన ఇంటి క్లీనింగ్ కని పట్టుకున్నారు. అద్దెలో కొంత తగ్గిందికదా అని సంతోషిద్దామంటే కారు పార్కింగ్, జిమ్, స్విమ్మింగ్ పూల్‌కి ఎక్స్‌ట్రా వసూలు చేస్తున్నారు. ఇంక మనం ఇంత అవస్థపడి ఇల్లు మారినదెందుకు? విసుగ్గా అన్నాడు శంకర్.

"మంగమ్మగారు! మీరు చెప్పిన మూవ్ ఇన్ స్పెషల్ సలహా మిస్ ఫైర్ అయిందండీ" అంటూ ఉడికించారు మంగపతిగారు.

"ఏదో ఈసారి ఇలా అయింది. సరే ఈ మంగమ్మగారి మాట వినండి... మనమ్మాయి, అల్లుడు ఈసారి ఇల్లంటూ మారితే స్వంత ఇంట్లోకే వెడతారు చూడండి!" అంటూ కొంగు దులిపి నడుము చుట్టూ దోపి విసవిస లోపలికి నడిచారు మంగమ్మగారు.

● ఆంధ్రభూమి సచిత్ర మాస పత్రిక - 24-5-2007 ●